ఉత్ప్రేరితులు!

శ్రీ జి. భాను

గుడ్డికంటిలో పాపలాగ వున్నాడు చంద్రుడు. భూదేవి వక్షోజంలావున్న పర్వతానికి సన్నని వలిపెంలాగా తెల్లని మబ్బుచాలులు అడ్డుపడ్డాయి. ఎక్కడో మెరుపుమెరిసింది. పాత్రలాంటి ఆకాశం పగిలింది. సాగరతరంగాల కన్నుల్లో కాంతి మెరసింది. పగిలిన ఆకాశం నుండి కన్నీటిధారలు నల్లగా స్రవిస్తున్నాయి.

మబ్బుల వెనకాల మెరుపుతీగల ఎలనాగల నాట్యం. ఆ నాట్యానికి అనుగుణంగా ఉరుములవాద్యం. ఆనందబాష్పాల ప్రవాహం. హర్షంతో సిక్తమైన ప్రకృతి. అదోరకమైన వాతావరణం.

ఒకనల్లని ఆకారం వణుకుతూ వేగంగా నడుస్తున్నది. ఎక్కడా తలదాచుకొనే ఆశ్రయం కనబడలేదు. ఇంకా వేగంగా నడుస్తున్నది. తలమీదనుండి నీళ్ళు విచారంగా జారుతున్నాయి. ఆకారం ఇంకా వేగంగా నడుస్తున్నది. దగ్గర ఎత్తైన దిబ్బమీద ఇల్లులాటి ఆకారం. ఆకారం కాళ్ళు ముందుకు నడచాయి. కళ్ళు నిశితంగా చూశాయి. ఆ యింటికి దూరంగా కొన్ని యిళ్ళు.

పగిలిన తలుపులోనుండి నలుపు పదార్థాన్ని ఛేదిస్తూ ప్రసరిస్తున్న కాంతికిరణం. లోపల ఎలుకల కీచులాట. ఆకారం కళ్ళు మెరశాయి. తలుపుతట్టాడు. ఒక వృద్ధురాలు వచ్చి తలుపుతీసింది. ప్రమిదలో ముఖాన్ని పరీక్షగా చూసింది.

'రా నాయనా! తడిసిపోయావు. ఎవరు నాయనా నూవు?' అంది. అతను సమాధానం చెప్పలేదు. వణుకుతూ నిలబడ్డాడు. ఒకతుండుగుడ్డ తీసుకొనివచ్చి యిచ్చిందా వృద్ధురాలు. తల తుడుచుకొన్నాడు. మాసికల చొక్కా పిండుకొన్నాడు. కొంచెం వణుకు తగ్గింది. చుట్టు కలయజూచాడు.

ఒక చిన్న మంచం మీద పన్నెండుసంవత్సరాల అమ్మాయి నిద్రపోతూ వుంది. తెల్లని అమాయకమైన ముఖంమీద నల్లని వెంట్రుకలు చిన్నగాలికి కబుర్లు చెప్తున్నాయి. బరువైన రెప్పలు విశాల నేత్రాలపైన భారంగా నిద్రపోతున్నాయి. ఆకన్నుల్లో ఎంత సోయగం వుందో అనిపిస్తుంది. చుట్టు కలయజూచాడు. వ్రేలాడుతున్న మొక్కజొన్నకండెలు. వలసంచిలోనుండి కనిపిస్తున్న పెద్ద ఉల్లిపాయలు. ఒకమూలగాదె. రెండు చెక్కపెట్టెలు. ఇంకొకమూల ఎఱ్ఱచిరుగడదుంపలు. ఇంకొకమూల మట్టిపొయ్యి. దాని ప్రక్కన పొంతకుండ. ఇంటకప్పులోనుండి పిచ్చికల కలవరింతలు.

'ఏఁ నాయనా! ఆకలిగా వుందా?' అంది. 'ఊఁ' అన్నాడు.

కాసిని చిరుగడదుంపలు, ఒకముంతలో మజ్జిగ తీసుకొనివచ్చింది ముసలమ్మ. అతను ఆత్రంగా తిని, మజ్జిగత్రాగాడు, ఆకలి ఉపశమించింది. చినిగినచాప మీద పడుకొని అలాగే నిద్రపోయాడు. ప్రమిదలో నూనెలేక వత్తి కునుకుతూ నిద్రపోయింది. ఆకాశం ప్రశాంతంగా కన్నులు మూసింది. వర్షం ఆగిపోయింది.

ప్రపంచపు కంటిపాప తూర్పురెప్పలోనుండి అందంగా చూసింది. సరుగుడు తోపులలోనుండి గాలి భయంకరంగా వీస్తున్నది. వెదురుపొదలలో గువ్వల జంట విహారాల చేస్తున్నది.

అతను లేచాడు. బయటకు వచ్చాడు. ముసలమ్మ మొక్కజొన్నలు దంచుతున్నది. ఆప్యాయంగా చూసింది. ఆకన్నుల్లో ఆదరణ గోచరించింది.

'ఏఁ...నాయనా! బాగా నిద్దరోయావ్. ఏవూరు మీది? అమ్మ, నాన్న ఉన్నారా?' అంది. అతను యీ ప్రశ్నకు పెద్దవిలువ యివ్వలేదు. కంచెమీదకు పాకుతున్న కాకర చూస్తూ 'నాకు ఏ వూరు లేదు. మా అమ్మ, నాన్న లేరు' సునాయాసంగా అన్నాడు.

వృద్ధురాలి ముసలి నేత్రాల్లో ఆశ్చర్యచిహ్నాలు నీళ్ళరూపంలో కనబడ్డాయి.

'ఎక్కడకొచ్చావ్ నాయనా మరి?'

'ఈ పల్లెటూరు చూద్దామని' నిర్లక్ష్యమైన సమాధానం.

'అయితే మా యింట్లో వుండి పోకూడదూ? మొగదిక్కు లేదు నాయనా' పెదవులు విరుస్తూ జాలిగా అడిగింది.

'ఎందు కుండాలి; నే నుండను'

'సరలే నాయనా' నోట్లో అనుకుంది.

'అమ్మమ్మా! అమ్మమ్మా! ఎక్కడున్నావే. తొందరగా రావే' అంది ఆపిల్ల గొంతు.

'వస్తున్నానమ్మా' అంటూ లోపలికి వెళ్ళి బయటకు తీసుకొనివచ్చిం దాపిల్లను.

'ఎవరితో నే మాట్లాడుతున్నావ్?' అంది నెమ్మదిగా అడుగులు వేస్తూ. ముసలమ్మ మాట్లాడలేదు. పిండి చేటలోనికి తోడుతున్నది. ఆ అమ్మాయి అతనిపక్కన నిలబడింది.

'ఎవరితో నే అమ్మమ్మ మాట్లాడింది ఇందాక' రెట్టించి అడిగింది. అతని కేమీ అర్థంకాలేదు. 'మాస్తూ కూడ అడుగుతుందేమిటి?' అనుకున్నాడు మనసులో.

'ఒక అబ్బాయిలేమ్మా! నీ ప్రక్క వున్నాడులే' అంది ముసలమ్మ. ఎక్కడా అంటూ చేతులు చాచింది పిల్ల.

అతను ఆఅమ్మాయి ముఖం అప్పుడు చూశాడు. ఆఅమ్మాయి కళ్ళు నీలిపొరలతో కమ్ముకున్నాయి? కంటిపాపలు ఎక్కడో మినుకు మినుక్కుంటున్నాయి. రెప్పలు మాటిమాటికి ఆర్పుతున్నది. కళ్ళవెంబడి నీళ్ళు కారుతున్నాయి. ఆ అమ్మాయి గ్రుడ్డిది.

అతను చకితుడయ్యాడు. మొదట ప్రకృతిలోని వికృతి జ్ఞప్తికివచ్చింది. మధుర సౌరభ్యాలతో మత్తు గొలిపే గులాబిపూవులలో ముళ్ళు—ప్రకాశమైన మెరుపులో ఇరమ్మదం—చల్లని తెల్లని చందమామలో మచ్చ—అమృతం ఉండాల్సిన హృదయాలలో విషం—ఎవరో ఒక పరమేష్ఠి విచిత్రప్రకల్పనగా అనిపించింది. ఆపిల్ల అతనిచెయ్యి పట్టుకుంది.

'అమ్మమ్మా! నిజంగా నేయ్..ఎవరే అబ్బాయి?' సంతోషంతో అంది.

'ఊరికే వచ్చాడమ్మా! రాత్రి వర్షం వస్తే'

'అమ్మా! ఇక్కడుంటాడంటే'

'ఎందుకుంటాడు. ఉండడమ్మ' ముసలమ్మ యింకేం మాట్లాడలేదు. పిండితో యింట్లోకి వెళ్లింది. ఆ గ్రుడ్డిపిల్ల మాట్లాడకుండా అతని చెయ్యి వదిలివేసింది. అతనికి ఏమిటోలాగా అయింది మనస్సు.

తొమ్మిదిగంటలైంది. అతను బయలుదేరడానికి సంసిద్ధంఅయ్యాడు. ముసలమ్మ, ఆపిల్ల మౌనంగా అంగీకారం తెల్పారు. ఆముసలమ్మ అతనుంటే బాగుండును అనుకుంది. ఆపిల్లకూడా అతనుంటే కలసి మెలసి వుండొచ్చు అనుకుంది. ఇంత తక్కువ కాలంలో నే ఆ కుర్రవాడంటే ఏమిటీ మనస్సులోపల సన్నిహితత్వం' మమకారం—అనుకుంది వృద్ధురాలు మనసులో. ఆపిల్లకు అతనంటే ఎందుకు మమకారం ఏర్పడిందో ఆమెకే తెలియలేదు. హృదయానికి హృదయానికి అనూహ్యమైన, అగోచరమైన రాగబంధం వుండకపోతే అలాంటి భావం వుండదనుకొన్నారు. ఆ రాగబంధమే అవ్యక్తమైనస్థితి. అలౌకికమైన స్థితి — వర్ణించలేని స్థితి. ప్రాక్తనమానవుని హృదయస్పందనంలోనుండి నేటివరకు అవిచ్ఛిన్నంగా వ్యాప్తమవుతున్న చప్పుడు చేయని అర్గళబంధం.

అతను బయలుదేరే సమయానికి ఏతాముదగ్గర వాళ్ల పొలంలో పనిచేస్తున్నారు. ఆ గ్రుడ్డిపిల్ల ఏతాము గడమీద నుంచొని బావిలో పెద్దబొక్కెన ముంచుతున్నది. ముసలమ్మ నీళ్లు తోడుతూ, కూరగాయమొక్కలకు పాదులు తీస్తున్నది అతికష్టంగా. ఏతాము గడమీద నుంచున్న పిల్ల ప్రపంచంతో ప్రమేయంలేకుండా ఆశ, జిజ్ఞాస, నిరాశ, నిస్పృహ లేకుండా నీళ్ళు తోడుతున్నది సర్కసులోని జంతువులాగా.

అతను దూరంగా నిలబడి చూశాడు—పిల్లకాలువలోనుండి గలగలమని పరిహాసంగా నవ్వుతూ ప్రవహిస్తున్ననీటి సందడి—జీవం తెచ్చుకొంటున్న మొక్కల కదలిక—కదులుతున్న చెట్లనీడలు—ముసలమ్మ అవస్థ, గ్రుడ్డిపిల్ల పని—విశాలమైన ఆకాశం—పనిలేక తిరుగుతూ ఎప్పుడో ఒకప్పుడు వర్షించే మేఘాలు — సంచారం చేస్తున్న పక్షులు — బారులు తీర్చి వెళుతున్న చీమలు—అతని చీకటి మనసులో కాంతి కలించాయి.

'వస్తానమ్మా' దగ్గరకువెళ్ళి అన్నాడు.

ముసలమ్మ ఆశగా లేచి నుంచొని 'మంచిది నాయనా' అంది. ఆ మాటల్లో అతని కెంతో ఆప్యాయత, ఆదరణ, అనురాగం కన్పించాయి. గ్రుడ్డిపిల్లవైపు చూశాడు. ఆపిల్ల పని ఆపి అతని మాటలాడుతున్న దిక్కున చెవిపెట్టివింటున్నది. ఆ అమ్మాయిముఖంలో ఏదో ఆవేదనలాంటి కదలిక కానవస్తున్నది. పెదవులు చలిస్తున్నాయి.

అతను వాళ్లిద్దర్నీ చూడలేకపోయాడు. నడక సాగించాడు తన ప్రపంచంలోనికి. వెనక్కు తిరిగి చూశాడు. జాలిగా చూస్తున్న ముసలమ్మ— స్తబ్ధంగా నిల్చున్న గ్రుడ్డిపిల్ల, వారివైపునుండి విచారకరమైన గాలి. కొన్ని అడుగులు ముందుకు వేశాడు. వెనక్కు చూశాడు. ఇంకా నిల్చొని తనవైపు చూస్తున్న వృద్ధురాలు చేయి వూపుతున్న తీరు నిలబడ్డ గ్రుడ్డిపిల్ల—ఇంకా కొన్ని అడుగులు ముందుకు వేశాడు. పూర్వం లాగే నిల్చున్న గ్రుడ్డిపిల్ల, వృద్ధురాలు, ఎదురుగా ఆకులురాలి చిగుర్చుతున్న చెట్లు, 'అంబా' అని అరుస్తూ తల్లివైపు చూస్తున్న లేగదూడ – మరలా తిరిగి చూశాడు. చేయి విసురుతున్న ముసలమ్మ, నిల్చున్న గ్రుడ్డిపిల్ల. మనసు కరిగింది. తలపు మారింది. నయనాలు ఆర్ద్రాలైనాయి. కాళ్ళు ముందుకు సాగలేదు. వెనక్కు తిరిగాడు. ఒక్కటే పరుగు—ఒక్కటే నిశ్వాసం. ఒక్కటే దీక్ష. ముసలమ్మ పాదాలపై పడిపోయాడు.

'అమ్మా! నే వెళ్ళనింక!'

'మా నాయనే! మా నాయనే!' కౌగలించుకొంది. ముసలమ్మ కన్నుల్లో నీరు చిప్పిలినాయి. ఏతాము మీద నుంచున్న పిల్ల మనసులో హర్షం కురిసింది. ముఖంలో సంతోష రేఖలు గ్రుడ్డికన్నుల్లో ఆనందబాష్పాలు.

2

ముసలమ్మ 'కృష్ణుడూ' అని పిలిస్తే అతను ఆనందం పొందేవాడు. 'రాధా' అని కృష్ణుడు పిలిస్తే ఆపిల్ల ఉప్పొంగిపోయేది. ముసలమ్మ పేరు నాగమ్మ.

కృష్ణుడు రాధతో పనులు చేయించడంలేదు. రాధ కొంతకాలం ససేమిరా అంది కాని చివరకు అతని మాట శిరసావహించింది. ఏవో చిన్న పనులు చేసేది. ముసలమ్మ అప్పుడప్పుడు అనుకొంటూ వుండేది – తన కొడుకే గనక బ్రతికి వుంటే కృష్ణుడికి లాగా పదహారేళ్లు వుండేవి; పుట్టగానే తండ్రిని పొట్టనబెట్టుకుని, చిన్నతనంలోనే తల్లిని చంపుకొని, పొరలుక్రమ్మి దృష్టి లేని కూతురు బిడ్డ రాధకు ఈడుజోడు అయ్యేవాడు అని.

కృష్ణుడు ముసలమ్మదగ్గర వుంటూ అర ఎకరం మెట్టలో కూరగాయలే కాకుండా రకరకాలు పూల మొక్కలు తెచ్చి నాటాడు – గులాబీ, కాగడామల్లెలు, మల్లెతీగలు, సన్నజాతులు, కనకాంబరాలు నాటాడు. శ్రమ అనుకోకుండా పసిపిల్లల్ని పెంచినట్లు పోషణ చేయసాగాడు. ఇపుడు గమ్యరహితంగా సంచరిస్తున్న అతని హృదయంలో ఏదో తృప్తి తొణికిసలాడింది. మాతృమూర్తివంటి ముసలమ్మ—లోకం తెలియని రాధ అవలంబంలేని అనాధస్థితి కృష్ణుణ్ణి బంధించివేశాయి. ఇక వారి యోగక్షేమాలే తన లక్ష్యంగా నిర్ణయించుకొన్నాడు.

అశాంతిలో సతమతమౌతున్న నాగమ్మ మనస్సుకు యిప్పుడు ప్రశాంతి దొరికింది. కొడుకువంటి కృష్ణుడు ఎదురుగా వుంటే ఆమె కళ్ళు ఆమె హృదయంలోకి చూచేవి. ఆమె నిశ్చింతగా వుంది.

రాధ హృదయం కృష్ణుని దాక్షిణ్యత్యాగాలవల్ల హర్షపరిప్లుతమైంది. ఉషారుగా మాట్లాడుతూ, చలాకీగా పనిచేస్తున్న కృష్ణుడంటే రాధకు చాల ఇష్టం. అంతేకాదు; అతనంటే అమితభక్తి. ఎలాంటిసంబంధం లేకుండా తన అమ్మమ్మకు, తనకు సహాయంగా వున్నాడు అంటే అతను ఎంతో మంచివాడు అనుకుంది. క్రమక్రమంగా కృష్ణుణ్ణి ఊహించి అతని ఆకారం హృదయంలో లిఖించుకొంది. రోజుకి రోజు తన భావనా మూర్తికి నగిషీ పెడ్తున్నది.

విసుగు విరామంలేకుండా కృష్ణుడు పనిచేస్తున్నాడు. రాధకు ఎన్నో సంగతులు చెప్పేవాడు. ఆమెకు చిత్రంగా వుండేయి అతని మాటలు. అందుకనే కృష్ణుణ్ని దేవుడనుకొన్నది. బాధలతో, అశాంతితో అణగారిపోయే దౌర్భాగ్యజీవులకు సహాయంచేయడానికి దేవుడు మారువేషంలో వచ్చేవాడని ఆమె అమ్మమ్మ చెప్పినమాటలు కృష్ణుడి విషయంలో సమన్వయపరుచుకుంది. 'ఏమో! దేవుడేమో!' అనుకొనేది. అమ్మమ్మ తనకు గోపాలకృష్ణుడు దయాపరుడని కుచేలునివంటి నిరుపేదలకు సహాయంచేశాడని, నమ్మినవాళ్ళకు కొంగు బంగారమని చెప్పగా విని నిజంగా ఆ కృష్ణుడే ఈ కృష్ణుడుగా వచ్చాడేమో అనుకొనేది రాధ.

'రాధాకృష్ణులు' అని నోట్లో అనుకొని సిగ్గుపడేది రాధ.

మల్లితీగలు సాగుతున్నాయి. పూలమొక్కలు ప్రాణాన్ని పొందాయి. కృష్ణుడు శ్రమ అనేమాట లేకుండా కృషిచేస్తున్నాడు. ముసలమ్మ 'నా కన్న తండ్రి! నా చక్కనయ్య' అని మురిసిపోయేది కృష్ణుణ్ణి చూసి. అమ్మమ్మ ఆ కృష్ణపరమాత్ముడు చాల అందమైనవాడని, ఆకారం చూసినట్లైతే జన్మ తరిస్తుందని, ముల్లోకాలు పరవశమౌతాయనే మాటలనుబట్టి రాధ 'కృష్ణుడు చాల అందంగా వుంటాడు' అని ఊహించు

కొన్నది. 'అందం అంటే ఏమిటి?' అనుకుంది రాధ మొదట ఆమాట విన్నప్పుడు. ఇప్పుడు అందం అనే మాటకు అర్థం కొంత తెలిసింది—కళ్ళుండి, దయార్ద్ర స్వభావంవుండి, తీయగా మాట్లాడితేనే అందం అను కుంది రాధ. 'ఈకృష్ణుడు చాలా...అందమైనవాడు. అందరికన్నా—అందమైనవాడు......కళ్ళున్నవాళ్ళకు గ్రుడ్డివాళ్ళకన్న అందంగా కనబడతాడేమో?' అను కుంది రాధ. రాధ మనసులో కృష్ణుడు నిండిపోయాడు.

రాధ భావనాభారంతో కాలం ఉత్సాహంగా సాగుతున్నది.

కృష్ణుడు ఎనిమిదిమైళ్ళదూరంలోవున్న బస్తీకి వెళ్ళి కూరగాయలు అమ్మి రాధకు ఏవో తినుబండా రాలు, క్రొత్తబట్టలు, ఇంట్లోకి చిల్లరసామగ్రి తెచ్చే వాడు. ఆ సమయంలో అతను ఒక పిల్లనగ్రోవి తెచ్చు కొన్నాడు. ఒకనాడు సాయంత్రం కొంచెందూరంగా వున్నకొండలమీదనుండి పిల్లవాయువులు ఆనందాన్ని కబుర్లుచెబుతూ, గోరువంకలకంఠాల్లో ఉత్సాహాన్ని కురిపిస్తూ, గగనరంగస్థలంలో నడయాడుతున్న మబ్బు లకు మందగమనాన్ని నేర్పుతున్నసమయంలో వేణు గానం సాగించాడు లేమామిడిచెట్టుక్రింద.

తీవలు తీవలుగా, తెరలు తెరలుగా, క్రమ క్రమంగా వేణునాదంస్థాయి అందుకొన్నది. ప్రకృతి పరవశమైపోయింది. రాధ సమ్మోహితయైపోయింది. ఆమెరక్తంలో ప్రత్యణువు నాట్యంచేసింది. రోమాంచం కల్గింది. గ్రుడ్డికళ్ళు ఆనందంతో మెరిశాయి. భాష్ప కణాలు రాల్చాయి.

'అవును నిజంగా ఈకృష్ణుడు—ఆ కృష్ణుడేమో! ఆ కృష్ణుడు బృందావనంలో, యమునాతీరంలో, గోపికలదగ్గర, గోవులు ఆనందపడేటట్లు, పువ్వులు విక సించేటట్లు పిల్లనగ్రోవి ఊదేవాడని అమ్మమ్మ ఏమిటే మిటో గొడవగా చెబుతుంది. అమ్మమ్మ చూసి దేమో మరి! కాని ఈకృష్ణుడు పిల్లనగ్రోవి ఊదటం చాల బాగుంది. ఏమిటో సంతోషంగా వుంటుంది. ఎట్లా ఊదుతాడోమరి' అనుకొనేది రాధ.

మొత్తంమీద కృష్ణుడు రాధ తలంపుల్లో తాదా త్మ్యం చెందాడు. ఆమె నిశ్వాసంలో సమ్మిళిత మైనాడు. అతను మాట్లాడుతుంటే హృదయం ఆనం దంగా వుండేది. ఒక్కొక్కసారి కృష్ణుడు సంతోషంగా 'రాధా' అని పిలిస్తే ఆమె గుండెలో వేయివసంతాల చిగురుల మృదుత్వాల సిగ్గు మొగ్గ అయ్యేది.

'ఒరే కృష్ణుడూ! మన కెందుకురా యీపిల్ల? నువ్వు దానితో మాట్లాడమాక' అని నాగమ్మ అంటే ఒకరకంగా నవ్వేవాడు కృష్ణుడు. అపుడు రాధ బాల్య ముగ్ధత్వం నునుచెక్కిళ్ళలోకి దూరి, హృదయంలో నాట్యంచేసి 'పో! అమ్మమ్మా' క్రిందమూలేది.

3

నాలుగు వసంతాలు కాలంముఖంలో శోభను కూర్చాయి.

స్నిగ్ధ గగనపు గులాబిరంగు అగాధసాగరం ముఖంలో ప్రతిబింబం చూసుకుంది. భూదేవి తుంగ స్త నాలైన పర్వతాలు ఆకుపచ్చని రంగుపయ్యెద కప్పు కొన్నవి. సూర్యునిరాకలో కలువలు సిగ్గుతో ముకు ళించుకొన్నాయి. మామిడి చిగురు మెసవిన కోయిల కన్నెల కంఠనాదాలు ప్రకృతిహృదయాన్ని తట్టి లేపాయి. ఆకాశంలో మబ్బులు అందంగా అడుగులు నేర్చుకొంటున్నాయి.

మల్లెలు, మొల్లలు రెప్పలు విప్పాయి. గులాబీలు సౌరభాన్ని నిర్వికల్పంగా వినిపించాయి. మొగపూలు నిట్టూర్చాయి.

వసంతంలో మధుమాసంలాగా, మధుమాసంలో నవపల్లవంలాగా, నవపల్లవంలో లతాంతంలాగా, లతా తంలో మకరందంలాగా, మకరందంలో మాధుర్యం లాగా రాధలో నవయౌవనచిహ్నాలు చోటుచేసు కొన్నాయి. ఆమె అందం సూర్యుడు లేని ఉదయంలా వుంది, చంద్రుడులేని వెన్నెలలా వుంది, మృదుత్వం లేని నవనీతంలా వుంది, ప్రేమలేని హృదయంలా వుంది.

నాగమ్మ జవసత్వాలు ఉడిగిపోతున్నాయి. రాధ, కృష్ణుడు ఆమెకు నేత్రాల్లాగా వున్నారు. అదివరకు కంటె, ముసలమ్మ యింటిపరిస్థితి మారింది. కృష్ణుడు నాటిన పూలమొక్కలు కన్నులు విచ్చి కటాక్షిస్తుంటే వాళ్ళలేమి తిరుగుముఖం పట్టింది. నాగమ్మ కృష్ణుణ్ణి మనసులో మొక్కుకునేది. కృష్ణుడి ఆదరానికి రాధ మురిసిపోయేది. ఆమెకు కావలసినవన్నీ కృష్ణుడు తెచ్చే వాడు. అతనిగురించి ఆలోచించడమే ఆమెకు చర్యగా అయింది. కృష్ణుడు ఎంత మంచివాడు! అతనిహృదయం ఎంత విశాలం! కృష్ణుడు ఎలా వుంటాడు! బాగా మాట్లాడుతాడు కూడా! తానంటే చాల అభిమానం! అసలు అతనికి వాళ్ళకు గల సంబంధం ఏమిటి? కళ్ళున్నవాళ్ళందరూ మంచివాళ్ళే నన్నమాట! ఏమో! ఎందుకు సహాయం చేస్తున్నాడు? – అని రాధ అనుకొనేది.

అందరికీ కళ్ళెందుకున్నాయి? తనకెందుకు లేవు. అమ్మమ్మ పూర్వజన్మలో చేసుకొన్న పాపంవల్ల గ్రుడ్డి కళ్ళు వచ్చాయి అంటుంది. అసలు పాపం అంటే ఏమిటో? అయినా తానొక్కతేనా పాపం చేసింది? ఎవరూ చేయలేదా పాపం?—

ఈ లోకం ఎలా వుంటుందో! అమ్మమ్మ చీకటి, పగలు అంటుంది. తనకేమో అంతా నల్లగావుంది. గులాబీలు, మల్లెపూలు బలే మంచివాసన! అవి ఎట్లా వుంటాయో? మరి పిట్టలు...పిచ్చిక...కళ్ళు లేకపోతే ఎందుకు బ్రతుకు? ఒక్కసారి కళ్ళొస్తే! కృష్ణుణ్ని చూడొచ్చు. అమ్మమ్మను చూడొచ్చు! అంతా చూడొచ్చు—అనుకొనేది రాధ.

కృష్ణుడు మాట్లాడుతుంటే—'వెన్నెలలాగా చల్లగా-ఉదయంలాగా ఉల్లాసంగా -ఏమిటో ఒక లాంటి ఆనందంగా వుంటుంది. ఎందుకోమరి? అసలు.. కృష్ణు డెలావుంటాడు?' - అనుకొనేది రాధ.

ఒకనాడు సంధ్యాసమయం. కృష్ణుడు ఇంటి ఎదురుగావున్న మామిడిచెట్టు క్రింద కూర్చొని, కూని రాగం ఆలపిస్తూ మామిడిచెట్టును కలయజూస్తున్నాడు. అతని వినికిడినిబట్టి రాధ నెమ్మదిగాఅక్కడకు వచ్చింది.

'రాధా! ఈ మామిడిచెట్టు నాలుగేళ్ళకు పూత పూసింది' అన్నాడు.

'అవును. నాకు వాసనవస్తుంది. అబ్బ! నాలు గేళ్ళకు పూతపూసింది!'

'రాధా! మనం...ఆ రోజు ప్రొద్దున...ఎద్దులు నన్ను తరుముకొన్నాయని చెప్పానే అప్పుడు కదూ దీన్ని నాటింది?'

'ఆఁ...మరేఁ...'

'చూశావా! రాధా! కాలం ఎంత త్వరగా పరు గెడ్తావుందో? నేనువచ్చి నాల్గు సంవత్సరాలు అయిందా? ఇదిగో! మామిడిచెట్టు పూసింది. అదుగో! అక్కడ పొగడచెట్టు పెద్దదయింది. మల్లెపొదలు గుబురులయ్యాయి. గులాబి మొక్కలు బాగా పెరి గాయి. అంతా మారిపోయిందికదా?'

'నీకిదంతా మారిపోవడమే చిత్రంగా వుందా?' ముఖంలో ఏవో కదలికలు కన్పించాయి.

'ఏం...నీకు లేదా?'

'అబ్బే ఎందుకులేదూ? నాకు నేనే చిత్రంగా లేదూ?' హృదయంలో బాధ మాటల్లో కనబడింది.

'ష్.. తప్పు రాధా... నేను ఏం చెప్పాను నీకు; ఎప్పుడూ అట్లా అనొద్దు?' బాధగా అన్నాడు.

'అవును నేనెందుకు బదకటం...చెప్పు...ఈ గుడ్డికళ్ళు .చీకటి...నలుపు...ఒకరి ఆధారం...నాబతు కెందుకు?' ఆమెకన్నులు ఏడ్చాయి.

'అదే తప్పు రాధా: బాధ...ఆనందం మానసిక వికారాలు. ఇంతే రాధా!...నీకు కళ్ళులేవని బాధ పడ్తున్నావ్. నేనూ బాధపడ్తున్నా నీకు కళ్ళులేవని; ఏముంది తేడా? నువ్వు గ్రుడ్డిగావుండి లోకం ఎంత బాగుంది - అనుకొంటావు. కళ్ళువస్తే లోకం గ్రుడ్డిది అనుకొంటావు. లోకం సమాధిలాంటిది. నువ్వు ఏడవ బోకు రాధా...ఏడవబోకు'. రాధా మాట్లాడలేదు. కొన్ని నిముషాలు గడిచాయి.

కృష్ణుడు చుట్టు కలయజూచాడు. పశ్చిమ దిక్కున సూర్యుడు అస్తంగతుడైనప్పటికి కిరణాలు ప్రపంచాన్ని విడువలేని ఆశల్లాగా బైటకు ప్రసరిస్తు న్నాయి. ప్రక్కన పర్వతాలమీద నెలవంక. పూత పూసిన మామిడిచెట్లు. ఆకులు రాలుతున్న వెదురు పొదలు. అతను ఆనందభరితుడయ్యాడు.

'రాధా! ఈవాళ చాల బాగుంది. కుంకుమ రం గుతో సూర్యు డస్తమిస్తున్నాడు. నల్లని పర్వతం మీద వున్న నెలవంక పరమేశ్వరుని జటాజూటంలో వున్న బాలచంద్రుడులావున్నాడు. అదిగో! మన ఏతాంవద్గర గుట్టమీద ఈతచెట్టుపై నుండి మినుక్కుమంటున్న చుక్క. వెదురుపొదలదగ్గర గువ్వలు సరసాలాడుకొంటున్నాయి. ఇదిగో! మనమామిడి చెట్టు పూతకు తేనెటీగలు ముసురుకొంటున్నాయి. విన్నావా! శేషమ్మగారి తోటలోనుండి కోయిల ఎంత బాగా కూస్తోందో! మల్లెపూలు విరిసి చాలా రాలి పోయాయి. అబ్బ! గులాబీలు ఎంత బావున్నాయి. కాగడా మల్లెల్ని దేవుడు మూగపువ్వులాగా ఎందుకు చేశాడబ్బా...' ఆగిపోయాడు. ఏడుపు విన్పించింది.

అతను స్తబ్ధుడయ్యాడు. హృదయం నిస్సత్తువ అయింది. రాధ ఎందుకు ఏడుస్తుందో అర్థమైంది.

'రాధా పొరపాటయింది...ఏదో ఉషారుగా అన్నిటిని చూస్తూ చెప్పానుగాని నా మాటలు నీకు బాధ కలిగిస్తాయనుకోలేదు. అనుకోనిరీతిగా నిన్ను బాధపెట్టారు. నన్ను క్షమించు రాధ,' భుజంమీది కండువాతో ఆమె ముఖంమీద స్రవిస్తున్న కన్నీళ్ళను తుడిచాడు. రాధశరీరంలో విద్యుత్తు ప్రసరించింది.

గుండెలోని రక్తానికి పోటు అధికమైంది. శరీరం గగుర్పొడిచింది.

'ఒక్క సంగతి చెబుతున్నా రాధా నీకన్నుల్లో నీటి తెరను నేను చూడలేను. నీ ముఖంలో విషాదాన్ని ఊహించలేను. నువ్వు ఉత్సాహంగా వుండకపోతే నేను వుండలేను ఇక్కడ. ఇంకా ఎన్నడైనా నీ కన్నుల్లో కన్నీరు కనబడితే నాకళ్ళల్లో అగ్ని...'

రాధ కృష్ణుడి పెదాలు చేతితో మూసి వేసింది. అతడు రాధ చేతిని మెల్లగా స్పృశించాడు. ఆమె హృదయం పాటపాడింది. ఆనందం వంత వేసింది. రాధ అతనికళ్ళు చేతితో స్పృశించింది.

'ఏమిరా పొద్దుపోవడంలా. చెట్టుక్రింద నుంచున్నారేం' అన్న నాగమ్మ మాటలు విని కృష్ణుడు రాధ చెయ్యిపట్టుకొని నడిపించుకొని వెళ్లాడు.

4

నిద్రలో రాధకు కలవచ్చింది. కలలో అనుభూతివచ్చింది. అనుభూతి అనుభవాన్ని మననంచేయించింది. చల్లనిచీకటి...నీళ్ళ గలగల...మల్లెపూల వాసన...గులాబీల సౌరభ్యం...కోయిలకూత...తనను పెనవేసుకోపోతున్న కృష్ణునిస్పర్శ...ఆనంద ప్రవాహం..మైకం..క్షణంలో విడిపోయి దూరంగా వెళ్ళిన కృష్ణుడు... భయానకమైన అతనికేక... ఆర్తనాదం కృష్ణా! అని కేక వేసింది దుఃఖపూరితకంఠంతో రాధ.

'పిచ్చిపిల్ల! కలవరిస్తున్నావా! లేమ్మా తెల్లారింది. కృష్ణుడు పూలు కోసుకొని బస్తీకెళ్ళాడు' అంది ముసలమ్మ తట్టుతూ. కలలోకల చెదరిపోయింది' కంగా లేచింది రాధ.

సూర్యుడు నెత్తిమీదకు వచ్చాడు. కృష్ణుడు లేకపోవడం రాధకు ఒంటరితనంగా, ఒకరకమైన భీతావహంగావుంది. మౌనంగా కూర్చున్నది. అప్పుడే కృష్ణుడు వచ్చాడు 'అమ్మా' అంటూ. వడ్లు ఎండబెడుతున్న ముసలమ్మ 'వచ్చావా నాయనా! కాళ్ళు కడుక్కురా. అన్నం తిందువు' అంది.

రాధ ముఖంలో సంతోషరేఖల చిహ్నాలు. ఉప్పొంగిన హృదయం.

'అమ్మా! బస్తీలో భలే పెద్ద డాక్టరు వచ్చాడు. అబ్బా! చాలమంది గ్రుడ్డివాళ్ళకు కళ్ళు తెప్పించాడనుకో! నేను ఆసుపత్రివద్దకు వెళ్ళి నాకో అమ్మాయి వుంది. తీసుకొస్తా అన్నా; తొందరగా తీసుకురా అన్నారు. కాబట్టి రాధను ఇప్పుడు తీసికెళ్తానమ్మా.'

'ఒరేబాబూ! నీపిచ్చిగాని వస్తాయి అంటావా?!' ఆశ్చర్యంగా అంది ముసలమ్మ.

'ఎందుకు రావే. చాలామందికి కళ్ళువస్తే. తప్పక తీసికెళ్తాను. ఏమంటావమ్మా'

నాగమ్మ కృష్ణుడి నిశ్చయాన్ని కాదనలేకపోయింది. చివరకు 'సరే' అంది.

ఈమాటలు వింటున్న రాధమనసు సంతోషంతో గంతులేసింది. కృష్ణుణ్ణి గట్టిగా కౌగలించుకొందామా అనిపించింది. అతనిపాదాలు ఆనందాశ్రువులతో అభిషేకంచేద్దామా అనిపించింది. అతని ముఖాన్ని ముద్దులలో నింపి తృప్తిపడదామనిపించింది. జీవితాంతం అతని బానిసగా వుందామా అనిపించింది.

బస్తీకి ప్రయాణమయ్యారు. వాళ్ళు బయలుదేరుతుంటే నాగమ్మకు అయోమయంగావుంది. తన నేదో ఏకాకితనం ఆవరించినట్లు బాధపడింది. రాధకు ఎన్నో జాగ్రత్తలు చెప్పి ధైర్యంచెప్పింది. అయినప్పటికి ముసలికన్నుల్లో నీళ్ళు తిరిగాయి. నేనుంటే భయం ఎందుకమ్మా—అని కృష్ణుడు అన్నతర్వాత స్థిమితపడింది. నాగమ్మవాళ్లు కనబడేంతవరకు చూసింది.

బస్తీలో మోటార్ల మోతలు, జనులకోలాహలాన్నీ విని రాధ ఆశ్చర్యపోయింది. కృష్ణుడు ప్రతిదాన్ని గురించి ఎంతో గొప్పగా చెప్పేవాడు రాధ బాధపడకుండ. 'నువ్వుకూడ చూస్తావులే లోకాన్ని' అనేవాడు. రాధ ఆనందంలో మునిగిపోయేది. అప్పటికి సాయంత్రం అయింది.

హాస్పిటల్ కు వెళ్లారు. డాక్టరు రాధ కళ్లు పరీక్ష చేశాడు. 'కళ్ళురావచ్చు. పొరలుమాత్రమే ఆపరేషన్ చేయాలి. ఇంతవరకు ఏ డాక్టరుకు చూపించకుండా ఎందుకుంచారు? అయినా ఫర్వాలేదు. ఇక్కడ నాలుగు రోజులు వుంచు; ఆపరేషన్ చేస్తాం' అన్నాడు. కృష్ణుడు మహానందంతో మునిగిపోయాడు. రాధకు క్రొత్తలోకంలోనికి ప్రవేశిస్తున్నాను అనేభావన కలుగుతున్నది.

అక్కడ ఏర్పాట్లన్ని సక్రమంగా జరిగాయి. డాక్టరు ఆపరేషన్ జరిగేరోజు తప్పక రావాలి అన్నాడు. తలూపాడు కృష్ణుడు.

'నేను యింటికివెళ్తున్నా రాధా! ఇక్కడ నర్సులు బాగా చూస్తారులే. అమ్మకు ఈసంగతులన్నీ చెప్పొద్దూ మరీ!'

'అమ్మో నేను ఒక్కదాన్నే; నాకు భయం. నువ్వు వెళ్ళొద్దు.'

'ఎల్లా రాధామరి? చెట్లకు నీళ్ళు పెట్టాలా? పూలు కోయ్యాలా? పాదులు చెయ్యాలా? ఇవన్నీ ఎవరు చేస్తారు చెప్పు. రేపు ప్రొద్దున పూలు అమ్మడానికి ఎట్లాగూ రావాలిగా.'

'రేపు తప్పక రావాలి...తప్పక రావాలి' అంది. 'ఓ' అన్నాడు.

నాలుగురోజులు గడిచాయి. ఆరోజు సాయంత్రం ఆపరేషన్ చేసే సమయంలో కృష్ణుడు అక్కడే వున్నాడు. ఆపరేషన్ జయప్రదంగా అయింది.

'ఇదిగో! వారంరోజుల్లో కట్టువిప్పుతాం. కళ్ళు వస్తాయి. అపుడు దగ్గరవుండాలి. నువ్వేనా వస్తావు? తప్పక రావాలి.?' అన్నాడు డాక్టరు.

'రోజూ వస్తున్నానండీ' అన్నాడు కృష్ణుడు. 'ఆల్ రైట్' అని వెళ్లాడు డాక్టరు. డాక్టరుమాటలు విన్న రాధ మనస్సు ఆకాశంలో తేలిపోతున్నట్లుగా, సంతోషప్రవాహంలో పయనిస్తున్నట్లుగా, ఆనంద స్వర్గంలో విహరిస్తున్నట్లుగా అనుకుంది. 'నాకు కళ్లు...వస్తాయి. నాకు కళ్ళు...వస్తాయి...వస్తాయి' మనసులో అనుకొని తృప్తిపడింది. కృష్ణుని ఆనందం వర్ణనాతీతం.

'రాధా నీకు కళ్ళు వస్తాయంట! నాకెంతో సంతోషంగ వుంది. అమ్మ ఎంత సంతోషపడుతుందో? కళ్ళువస్తాయన్నారు- అని చెప్తేనే అబ్బో ఎంత యిదయిందనుకొన్నావ్?'

'ఆఁ...నాకూ ఎంతోసంతోషంగావుంది... నే ననుకున్నానా? జీవితంలో యిలా అవుతుందని... నాకు...లోకం కనబడ్తుంది...నేనూ...; అది సరే గాని అమ్మమ్మరాలేదూ నన్నూ చూడ్డానికి?'

'ఎలావస్తుంది రాధా? మనిషిదగ్గర ఓపిక లేక పోయె. లేకపోతే రాకుండ వుండగలదా?'

'మల్లెపొదలు, మామిడిచెట్టు, పొగడచెట్టు ఎలా వున్నయ్?'

'మామిడిచెట్టు చిన్న చిన్న పిందెలు వేస్తున్నది. పొగడపూలు యిప్పుడిప్పుడే కనబడుతున్నాయి. మల్లెపూలు, గులాబీలు విరగబూస్తున్నాయ్. నీ పిచ్చిక కూడా బాగా నేవుంది రాధా! అప్పుడప్పుడూ అరుస్తూ వుంటుంది నీకోసమే నేమో?!' రాధ చిన్నగా నవ్వింది.

'వస్తా రాధా! పొద్దుపోతుంది; ఇంటికెళ్ళేటప్పటికి. కదలకుండా పడుకో.'

'నీ చెయ్యేది కృష్ణా...ఇలా...ఇవ్వు...ఇక్కడ మనుషులు లేరుగా,' అంది. కృష్ణుడు చేతిని అందించాడు. రాధ అతని చేతిని సున్నితంగా తన స్నిగ్ధకపోలాలమీద రాచుకొన్నది. క్రొత్తగా ప్రసవించిన బాడితె పువ్వులోని రేఖలతో సామ్యంకలిగిన అరుణాధరాలతో ముద్దు పెట్టుకొన్నది.

కృష్ణుడు కొంచెంసేపు మౌనంగావుండి మెల్లిగా చెయ్యిలాక్కొని 'వస్తారాధా' అని వెళ్ళిపోయాడు. రాధ కృష్ణుణ్ణిగురించి ఆలోచిస్తూ సుషుప్తిలో పడింది. ఆమె భావనాప్రపంచం, స్వప్నప్రపంచంగా మారిపోయింది. దానిలో అస్పష్టరేఖలు...నిర్దుష్టము కాని ఆకారాలు...

పదకొండవ రోజు...కృష్ణుడురాలేదు. ఆరోజు కట్టు విప్పలేదు. రాధ ఆతురతతో కృష్ణునిరాకకోసం ఎదురుచూస్తున్నది. రెండుసార్లు డాక్టరు అడిగాడు. ఇంకా కృష్ణుడురాలేదు. తన ఆలోచనల పరిష్వంగంలో మిళితమైన కృష్ణుడు-తన ఆశలో ఆశ-తన సంరక్షకుడు, తన సర్వస్వం...ఇంకా రాలేదు? ఎందుకు రాలేదు? రాకుండా వుండడే? కట్టు విప్పగానే అతనిముఖం చూడాలని వున్న రాధ మనసు ఆందోళనపడింది. మనస్సులో అనుకుంది రావాలి...రావాలి...అని. కొన్ని నిముషాల్లో కట్టువిప్పుతారు. కృష్ణుడు రాలేదు.

కట్టు విప్పారు. విశాలనయనాలమీద కనురెప్పలు భారంగా, బద్ధకంగా సోయగంతో, సుకుమారంగా— దృష్టికి అంధత్వానికి మధ్య తెరల్లాగా లేచాయి— కంటిలోకి వెలుగుచొచ్చుకుంది...వెలుగులోకి కంటికిరణం ప్రసరించింది...క్షణం చీకటి...మరుక్షణం దృష్టి...డాక్టరు నవ్వుతున్న ముఖం...అతని కళ్ళు. నర్సులు తెల్ల నిబట్టలలో...చెలాకీ కళ్లు. బయట ప్రకాశమైన వెలుతురు. పైనవిశాలమైన ఆకాశం...పలుచని మబ్బులు. పచ్చని...గుబురు నిద్రగన్నేరు చెట్టు...రాలుతున్న ఆకులు...చెట్టు మీద కిలకిలలు...పచ్చని చిలుకలు...చెట్టుక్రింద మందారచెట్టు...రాలిపోయిన ఎఱ్ఱనిపూలు రంగురంగుల పూలమొక్కలు...నిండు కదలిక...వాటిపైన సీతాకోకచిలుకల సంచారం... ప్రేమవిహారం...పచ్చనిగడ్డి...గాలికి కదులుతున్న వాటికంకులు...ప్రక్కన రోడ్డుమీద నడుస్తున్న మనుష్యులు...చిత్రదర్శనం...ప్రపంచం. లోకాన్ని రాధ చూసింది. లోకం రాధను చూసింది. అప్పుడే పుట్టిన జ్ఞానంగలశిశువులా రాధ విస్తుపోయి చూస్తున్నది. కళ్ళున్న సమస్యల జీవితంలో తొలిచూపును ప్రసరింపజేసింది రాధ. తనకు తానే క్రొత్తగా వుంది.

మరుక్షణంలో రాధహృదయంలో కృష్ణుడు మెదిలాడు. ఎలావుంటాడు? వీళ్ళ అందరికన్న బాగుంటాడు! డాక్టరుకన్న బాగుంటాడు! లోకంలో అందరికన్నా బాగుంటాడు! చూపులో...రూపులో ప్రతి విషయంలో బాగుంటాడు! మూర్తీభవించిన మార్దవం లాగా వుంటాడు. కృష్ణుణ్ణి చూడాలి...రాధకళ్ళు కోరుకున్నాయి. కృష్ణుని మాటలు వినాలి...చెవులు యాచించాయి. అతన్ని స్పృశించాలి. రక్తంలో ప్రత్యణువు అర్థించింది. నయనాలు రెప్పలు విప్పుకొన్నాయి. హృదయం కవాటాలు తెరిచింది. ఉత్సాహం ఉరకలు వేసింది...ఉద్వేగం పరిధి దాటింది...

మరుక్షణంలో నాగమ్మ జ్ఞప్తికి వచ్చింది. అమ్మమ్మ...ఎలావుంటుంది? తన శరీరాన్ని నిమిరే చేతిని ముద్దుపెట్టుకోవాలి. తనకు సపర్య చేసిన ఆమెను పూజించాలి. తనను పిలిచిన ఆమెకు ప్రాణం యివ్వాలి. తనను అనునయించిన ఆమెను అభివందనాలు చేయాలి.

రాధకు ప్రీతిపాత్రమైన వస్తువులు...స్మృతిలో నిర్దుష్ట ఆకారవిరహితంగా మసకగా మనసులో కదిలాయి. ఆనందం వర్షించింది. అనుభూతులను ఆలోకం వచ్చింది యధాస్థితికి వచ్చింది. ఎదురుగా డాక్టరు చిరునవ్వులో.

'ఏమండీ...మా కృష్ణ...రా...లే...దు' అంది దిగులుగా రాధ.

'వస్తాడులే గాని నువ్వు కళ్లుమూసుకొని పడుకో; నర్స్! టేక్ కేర్!' అని వెళ్లాడు డాక్టరు.

రాధ కృష్ణుణ్ణి మనసులో తలచుకొంటూ కన్నులు మూసింది. సాయంత్రం అయింది. రాధను చూడడానికి చాలమంది వచ్చారు. ఆమె అందాన్ని కళ్ళతో ఎంగిలిచేశారు. రాధ ప్రతివారిని పరీక్షగా చూసింది. ప్రతివారిని కృష్ణుడుతో పోల్చుకుంది. కృష్ణుడు వాళ్ళకన్న అందంగావుంటాడు...ఎంతో బాగుంటాడు. అనుకొనేది. రాత్రి అయింది. కృష్ణుడు రాలేదు. ఎందుకురాలేదు? అనేప్రశ్న ఆమె మనసులో పదేపదే ధ్వనించింది. తాను ఒక్కతే ప్రపంచంలో ఏకాకిగా, బిక్కుబిక్కుమంటున్నా ననిపించింది. ఆమెకన్నులు అశ్రుపూరితాలైనాయి. ఏడ్చి నిద్రపోయాయి.

తెల్లవారింది. రాధ సూర్యోదయాన్ని తొలిసారిగా చూసింది. కాకుల అరపులు, ప్రాతఃకాలపు ప్రత్యేకవాతావరణాన్ని నిశితంగా పరిశీలించింది. మనసులో ఏవేవో భావాలు క్రమ్ముకొన్నాయి. ఆరోజు కూడా ఎంతోమంది రాధను చూడడానికి వచ్చారు. అందాన్ని దర్శించారు. రాధ ప్రతివారిని చూసి కృష్ణుణ్ణి గొప్పగా మనసులో ఊహించుకొన్నది. మధ్యాహ్నాన్ని సాయంత్రం ఆక్రమించుకొంది. రాధ హృదయం ఉత్కంఠతో ఉరకలు వేస్తున్నది. కన్నులు మూసుకొని ఆలోచిస్తున్నది.

'రాధా!' సంతోషపూరితమైన కంఠధ్వని విన్పించింది. నాగస్వరం నిస్వనానికి కుబుసం విప్పిన కోడెత్రాచులాగా రాధ ఉవ్వెత్తుగా లేచింది. అతనిదే కంఠం! తన ఆశమోసు! దయానిధి; తను అందంగా ఊహించుకొన్న సుందరునికంఠం. రెప్పలు విరియించి చూసింది–ఎదురుగా కృష్ణుడు. మ్రాన్పడి పోయింది. గగనాగ్రం నుండి పాతాళంలోని కఠిన శిలాతలంమీద పడి ఛిద్రుపలై పోయింది ఆశాఫలం. చల్లని నీటితుంపరుల వర్షిస్తాయనుకొన్న మేఘాలు అగ్నికణాలు వర్షించాయి. కృష్ణుణ్ణి చూడలేకపోయింది...ఎఱ్ఱనిజుట్టు, వికారమైన నల్లనిముఖం. ఎక్కడోవున్న కళ్ళు. బండ పెదవులు, మెళ్ళోతుండు, కాకిరంగు బట్టలు, సన్నని శరీరం. కళ్ళుభారంగా మూసుకొన్నది. కన్నుల్లో క్షణంసేపు చీకటి, హృదయంపై క్షణంసేపు నల్లనినీడ, మెదడు పొరలలో కొంచెంసేపు అధిక ఉష్ణం. మనసులో చీకటి గుబుగుల మరుగులోని నిశ్శబ్దపు నిస్వనం – ఊహించుకొన్న ఆశల నిరాశల చిగురుకొసల నిశ్వాసాలు–ప్రకోపించిన రక్తపు స్తంభనం–కళ్ళు మూసుకొన్నది. కృష్ణుని ముఖంలో ఉత్సాహం తగ్గింది. శుష్కమైన నవ్వు నవ్వాడు.

'నేనే రాధా! నిన్న రాలేకపోయా. ఎద్దులు నన్ను తరుముకొని పొడిచాయి. అందుకని రాలేదు. అమ్మ అసలు తోటకెళ్ళొద్దు అంది. కానీ నేను వచ్చా రాధా. నీకు కళ్లు వచ్చాయి. నాకు ఎంత సంబరంగా వుందనుకొన్నావ్. అబ్బ! నాకు ఏమిటోలాగావుంది. అమ్మ ఎంత సంతోషపడ్తుందో! భాగున్నావా రాధా? నాకు ఏమి మాట్లాడాలో తెలియటం లేదు రాధా. నీకళ్ళు బాగున్నాయి కదూ? వంట్లో కులాసాగా వుందిగా? ఏమన్నా అనుకొంటావేమో ననుకొన్నాను. మాట్లాడు రాధా. డాక్టరు రేపుపొద్దున యింటికి తీసుకెళ్ళమన్నాడు. నేను రాత్రి యిక్కడేవుంటా. బాగావున్నావుగా?' ఆప్యాయత గోచరించింది మాటల్లో.

రాధ గొంతు పెగల్లేదు. మెల్లిగా రెప్పల విప్పి కృష్ణుణ్ణి చూసి మళ్ళా కన్నులు మూసుకుంది. ఆమె మనసులో ఆశకు నిరాశకు మధ్యవుండే స్థితి, భావనకు వాస్తవానికి మధ్యవుండే స్థితి, వెలుగుకు చీకటికి మధ్య వుండే స్థితి, కల్పనకు కలకు మధ్యవుండే స్థితి నర్తించింది. కళ్ళ చివరలలో నుండి అశ్రుధారలు. ఆమె శక్తిని కూడ దీసుకొన్నది. ఆమె అధరాలు స్పందించాయి.

'నేను బాగానే వున్నాను కృష్ణా! చాలా బాగున్నాను. నా కళ్ళు బాగా చూడగల్గుతున్నాయి. నేను చూశేవి ఇక్కడ ఏమున్నాయి చెప్పు. నా పరిస్థితి ఆలోచనలలో వుందిగా? ఎదురుగా ఏమీ కనబడ్డం లేదు. అంతా అగమ్యంగావుంది.'

'అవును రాధా నువ్వు చెప్పింది నిజం. నువ్వు ఏమీ చూడలేవు యిక్కడ; ఇంటిదగ్గర అయితే మామిడి చెట్టు...పొగడ చెట్టు...నీ పిచ్చిక...' ఫాల భాగంలో గీతలు కన్పించాయి.

రాధ నవ్వింది. ప్రాణం పోయే సమయపు చివరి చిరునవ్వులాగా నవ్వింది. హృదయంలో ఏడుస్తూ నవ్వింది. ఏమీ చెయలేక నవ్వింది. నవ్వలేక నవ్వింది. కృష్ణుడు బయటకు వెళ్ళాడు; రాధను నిద్రపొమ్మని చెప్పుతూ.

రాధ మనసులో ఏడ్చింది. తాను అనుకొన్న దానికన్నా విషమంగా పరిస్థితులు పరిణమించాయని వ్యథతో క్రుంగిపోయింది. కర్తవ్యం ఏమిటో అర్థం కాలేదు. ఏమి జరుగుతుంది? ఏంచెయ్యాలి? కర్తవ్యం బోధపడలేదు. చూస్తూ చూస్తూ మనస్సుకు యిష్టం కాని దాన్ని ఎలా ఎన్నుకోవాలి? వాసనలేని పువ్వును ఎలా ఆఘ్రాణించాలి? మృగతృష్ణ అని తెలిసి ఎందుకు పరుగెత్తాలి? అతను మానసికంగా మంచివాడు. దేవుడు...కాని కురూపి...తనపాలిటి రక్షకుండు... కాని—ఎలా? అటువంటివ్యక్తితో ఎలా ప్రవర్తించాలి? జీవితానికి భావికి మధ్యవుండే సమస్య ఎలాపరిష్కరించుకోవాలి?......అని మనసులో సమస్యలు క్రమ్ముకొన్నాయి.

ప్రశాంతమైన సముద్రంలో ఉత్తుంగ తరంగాల్లాగా, ఆ క్షణంలో వికసించిన పూలరేకులు ప్రచండమైన గాలిలో వణుకుతున్నవిధంగా, మధురమైన గానంలో అపశ్రుతిలాగా, ఆనందంలో ఆవేదనలాగా మనస్సులో సమస్యలు. చీకటి లోకాన్ని ఆక్రమించుకొంది. చీకటి రాధ మనసులో చోటుచేసుకుంది. ఆమె రెప్పలు చీకటిని ఆహ్వానించాయి. నిద్రాదేవత కౌగలించుకొంది. మనస్సు ఘనీభవించింది.

తెల్లవారింది. రాధాకృష్ణులు యింటికి బయలుదేరారు. రాధ ప్రతివస్తువును క్రొత్తగా చూసింది. కృష్ణుడు అన్నిసంగతులు చెప్తున్నాడు. కాని రాధ మౌనంగావుంది. తొమ్మిది గంటలైంది. ఇంటి సమీపానికి వచ్చారు. మామిడిచెట్టు, పొగడచెట్టు, వేపచెట్టు, ఏతాము, పొలం, పూలమొక్కలు—భావన కళ్ళల్లో కనిపిస్తూవుంది. అంతా క్రొత్తప్రపంచం... క్రొత్తభావాలు...క్రొత్త అభిలాషలు...దైన్యం... అగమ్యం...సమస్యలు......

ఎదురుగా ముసలమ్మ-ఆనందబాష్పాలలో క్రొత్త జన్మలాగా భావిస్తున్న ముసలమ్మ రాధ వేగంగా నడిచింది...ముసలమ్మ కాళ్ళమీద పడిపోయింది. కన్నుల్లో నీరు ఊరింది రాధకి. 'మాతల్లికి కళ్ళొచ్చాయి. మాతల్లికి కళ్ళొచ్చాయి' ఆనందంలో అంది ముసలమ్మ. రాధ శరీరాన్ని ప్రేమతో నిమిరింది. రాధ ప్రతిచెట్టు దగ్గరకు, ప్రతిగుట్టదగ్గరకు వెళ్లి పలకరించి వచ్చింది. నాగమ్మ, కృష్ణుడు ఆనందంలో మునిగిపోయారు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. రాధ పూర్వంలాగా కృష్ణుడితో కలసివుండటం లేదు. ఏదో ఆలోచిస్తున్నట్లు వుంటుంది ఎప్పుడూ. అకారణంగా ఏడుస్తుంది. నిద్రలో కలవరిస్తుంది. కృష్ణుడికి ఎదురుగా వుండలేకపోతుంది. అలంకరించుకోవడం కూడా లేదు. ముసలమ్మకు ఏమిటో క్రొత్తగా వుంది. మనసులో లోతులు చూసేశక్తి ఆమెకు లేదు.

కృష్ణుడు రాధనుపూర్తిగా అర్థంచేసుకొన్నాడు; దానికి అనుగుణ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అతని హృదయంలో సీలలు గ్రుచ్చినట్లుగావుంది. పూర్వంలాంటి ఆనందం లేదు. రాధ మాట్లాడ్డం లేదు. ఎవరో పరాయి మనిషిని చూసినట్లు ప్రవర్తిస్తున్నది. నవ్వుతో మాట్లాడ్డం లేదు. కనీసం ముఖంకూడ చూడడం లేదు. అతను కుమిలిపోయాడు. కళ్లురాకపూర్వం రాధకు, కళ్లువచ్చినతర్వాత రాధకు యెంత పోలికవుందో పోల్చుకున్నాడు 'రాధ మారిపోయింది...రాధ మారిపోయింది. ప్రౌఢత్వంపోయి మూగతనం వచ్చిందే అన్నట్లు మారిపోయింది' అని అనుకొన్నాడు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. ఆనాడు పౌర్ణమి. పశ్చిమదిక్కున కారుమేఘాలు.

'కృష్ణుడూ! రాధ పెండ్లిసంగతి ఏం జేయాలి. నాకు అంతుపట్టడంలేదు. ఏమిటో అదివరకంత చలాకీ లేదురా. నువ్వు ఏం జెపుతా?' అంది నాగమ్మ.

'నేనుండగా నీకెందుకమ్మా బాధ. అన్నిసంగతులు చూసుకోనేవాణ్ణి నేనున్నాగా? రాధకు ఏం లోటు వస్తుందమ్మా నీపిచ్చిగాని?' అన్నాడు. అంతలో రాధ ఇంట్లోకి వచ్చింది. కృష్ణుడు బయటకు వెళ్లాడు. రాధ కళ్లలో ఏదోబాధ వ్యక్తమౌతున్నది.

'అమ్మమ్మా! నేను కృష్ణుడిని చేసుకోను. అసలు ఈ యింట్లోనే వుండను. నాకు కళ్ళు వచ్చేటట్లు చేసింది యెందుకా అమ్మమ్మా? నాకు యిష్టంలేదు. ఏమాత్రం యిష్టంలేదు' అని గుండె పగిలేటట్లు ఏడ్చింది.

నాగమ్మ నోరు తెరచి అలానే వుండిపోయింది. మాట్లాడలేకపోయింది. ఆ మాటలు విన్నకృష్ణుడు ఇంట్లోకి వచ్చాడు. అతనికంట్లో రక్తపుజీరలు, హృదయంలో బాధాతరంగాలు, ముఖంలో చీకటిరేఖలు తెరలుతెరలుగా కానవస్తున్నాయి. రాధ బయటకు వెళ్ళబోయింది.

'ఆ...గు...రాధా...'

'ఎందుకు?'

'మా......ట'

'ఏం మాట?' బయటకు చూస్తూ అంది.

'రాధా...నువ్వు—నన్ను...అర్థం చేసుకో లేదు. అసలు...నా ప్రక్క నిన్ను కలలో గూడా... ఊహించుకోలేదు రాధా...నువ్వు...వెన్నముద్దవి... నేను...రాయిని. నువ్వు మంచిదానివి... నేను వికారిని...ఎందుకూ పనికిరానివాణ్ని. మొదట్లో అన్ని సంగతులు చెబుతామనుకొన్నాను కాని...నీకు మనశ్శాంతి లేకుండా చేస్తానేమోనని చెప్పలేదు రాధా. ....నువ్వు సుఖంగా...వుండాలి—నీ... కన్నుల్లో...తడి కనబడకూడదు.........నువ్వు... ఎక్కడకూ...వెళ్ళకూడదు...నీ...ముఖంలో... ఎప్పుడూ...విచారం... తొంగిమాడకూడదు...నీ... మనశ్శాంతికోసం...యిప్పు...డే...వెళ్తా. రా..ధా.. అమ్మని...జాగ్రత్తిగా...చూడు...నువ్వు...చాలా.. మంచి దానివి...నీకు...మంచి...భర్త...నస్తాడు... నీ జీవితం...బాగా గడవాలి...అంతే...నా-చివరికోరిక రాధా...' అని నాగమ్మవైపు తిరిగి...'నేనువస్తా... నమ్మా... రాధ...జా.... గ్రత్త...పూల....మొ... క్కలు......నాకు....ఎంతో...,.సంతోషంగా... వుం...డమ్మా...వస్తా...నమ్మా...వస్తా, రా..ధా., అమ్మా...నన్ను....కలలో....అనుకో....అమ్మా... వస్తా' ఇల్లు అంతా ఒక్కసారి కలయజూచి బయట ప్రకృతిని సానునయంగా చూసి కన్నీళ్ళు తుడుచుకొన్నాడు. వెనకకు తిరిగిచూడకుండా బయలు దేరాడు.

నాగమ్మ గుండెలో తడిలేదు. కళ్ళల్లో నీరు యింకిపోయింది. నోరు పడిపోయింది.

రాధ శిలాప్రతిమలాగా, అచేతంగా, స్తబ్ధంగా, మూగగా, పిచ్చగా నిలబడిపోయింది. కపోలాలమీద కన్నీరు ప్రవహిస్తున్నది. నిరంతరం ప్రవహించేటట్లు ఉందా తీరు.

ఆకాశం నిండుబొట్టుగా పెట్టుకొన్న చందమామను పశ్చిమదిక్కున నల్లని మేఘాలు క్రమ్ముకొన్నాయి. రాత్రి కాంత నిశ్వాసం ఉద్ధృతంగా వీచింది.

వెన్నెల మబ్బుల మాటున దాగింది. చీకటి స్వైరవిహారం చేసింది.

మెరుపుతీగ ఆకాశహృదయాన్ని పగులగొట్టింది. ఆకాశం చిన్నాభిన్నమైంది.

పిడుగుపాటుకు మావికొమ్మ పెళుక్కుమంది. పొగడకొమ్మలు రాలాయి.,

మల్లెపొదలు వణికాయి. గులాబిమొక్కలు తల వంచుకొన్నాయి.

రాధ కన్నుల్లో పిడుగు మిరుమిట్లు ప్రతిబింబించాయి.

కన్నుల్లో వెలుతురు హృదయంలో వెలిగింది.

'భగవాన్! నాకు కళ్ళెందుకిచ్చావ్...నాకు... కళ్ళెందుకిచ్చావ్' అని రాధ కుప్పగా కూలిపోయింది.

మెరుపుతీగ వెలుతురు యిచ్చింది.

దూరంగా వణుకుతున్న చుక్కలు మబ్బదుప్పటి కప్పుకొన్నాయి.